ప్రజాశక్తి
ఆదివారం 14 ఏప్రిల్ 2024
I
అల్లూరి సీతారామరాజు



## అరకులోయలో గాలి వాన

**ప్రజాశక్తి- అరకులోయ:** పర్యాటక కేంద్రమైన అరకులోయలో శనివారం మధ్యాహ్నం గాలి వాన కురిసింది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండతో ఉక్కిరిబిక్కిరి అయిన స్థానికులకు ఈ వర్షం కొంత ఉపశమనం కలిగించింది. మండుటెండలతో బాధ పడుతున్న స్థానికులు, పర్యాటకులు శనివారం మధ్యాహ్నం వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వేసవి పంట రైతులకు ఈ వర్షం ఎంతగానో ఉపకరిస్తుందని స్థానికులు తెలిపారు. సుమారు గంట పాటు వర్షం కురవడంతో స్థానికులు, రైతులు, పర్యాటకులు ఆశ్వాదించారు.



కురుస్తున్నవర్షం

# ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

**జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత**

**ప్రజాశక్తి-పాడేరు-** ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత స్పష్టం చేశారు. ఏపీ ఆర్ గురుకుల కళాశాలలో జీకే వీధి, కొయ్యూరు, అరకు వ్యాలీ మండలాల పీవో, ఏపీవోల శిక్షణ శిబిరాన్ని శనివారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ, ఎన్నికల అధికారులకు ఎన్నికల ప్రక్రియలో భాగంగా విధులు కేటాయించిన పీవోలు, ఏపీవోలు తప్పకుండా బాధ్యతలను నిర్వర్తించాలని, తప్పించుకోవడానికి ప్రయత్నించవద్దన్నారు. ప్రతి ఒక్కరూ శిక్షణ సదస్సులకు హాజరు కావాలని, ప్రతి అంశంపైనా క్షుణ్ణంగా అవగాహన పెంచుకోవాలని, అర్థం కాకపోతే అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఈవీఎంలు, వివి పాట్ , బ్యాలెట్ యూనిట్ నిర్వహణపై అవగాహన కల్పించారు. పోలింగ్ బూత్ ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ క్రమంలో సిబ్బంది, అధికారులతో కాసేపు మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎంవోటీలు శిక్షణ అందిస్తున్న తీరును పరిశీలించారు. పోలింగ్ ఏజెంట్లకు ఐదున్నర గంటలకు పోలింగ్ ప్రారంభిస్తామని సమాచారం అందించాలన్నారు.ఈ సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి, శిక్షణ అంశాలపై కలెక్టర్ మాట్లాడారు. విధులను అందరూ బాధ్యతగా నిర్వర్తించాలని, నిర్లిప్తత పనికిరాదని హెచ్చరించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న అధికారులకు వారి అర్హతల మేరకు పీవో, ఏపీవో విధులు కేటాయించామని అందరూ తప్పకుండా హాజరై సమర్ధంగా నిర్వహించాలని సూచించారు. శిక్షణ సదస్సులకు సమయానికి వచ్చి అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలని, సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని చెప్పారు. ఈవీఎంల వినియోగం, మాక్ పోలింగ్, ఇతర సాంకతిక అంశాలపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలన్నారు. టెండర్ ఓటింగ్, ఛాలెంజింగ్ ఓట్ పై అవగాహన ఉండాలన్నారు. ప్రధానంగా పీవో పాత్ర చాలా కీలకమని, అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను పూర్తిగా తెలుసుకొని సక్రమంగా అమలు చేయాలని చెప్పారు. అందరి సహకారంతో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం తరపున కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఓటింగ్ శాతాన్ని 75 నుంచి 80 శాతం వరకు పెంచేందుకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డిసి వివిఎస్ శర్మ, పీవోలు, ఏపీవోలు, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.



ఇవిఎంలపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ విజయసునీత



మాట్లాడుతున్న సిపిఎం చింతూరు మండల కార్యదర్శి సీసం సురేష్

## సిపిఎం గెలుపుతోనే ఆదివాసీలకు రక్షణ

**ప్రజాశక్తి -చింతూరు**

సిపిఎం ప్రజాప్రతినిధులు చట్టసభల్లో ఉంటేనే ఆదివాసీల మనుగడకు, హక్కులు, చట్టాలకు రక్షణ ఉంటుందని, అందువల్ల రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, సీనియర్ నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఇండియా ఫోరం (కాంగ్రెస్, సిపిఐ, ఆమ్ ఆద్మీ పార్టీలు) బలపర్చిన సిపిఎం రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థి లోతా రామారావు, అరకు పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి పి.అప్పలనర్సలను గెలిపించాలని కోరుతూ శనివారం మండలంలోని ఏడురాలపల్లి గ్రామంలో సిపిఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసి చట్టసభల్లో సిపిఎం ప్రజాప్రతినిధుల ఉండాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. ఈ సందర్భంగా సురేష్, శ్రీనివాసరావు మాట్లాడుతూ గిరిజన చట్టాలు, హక్కులు రోజురోజుకు హరించుకుపోతున్న నేపథ్యంలో ఆదివాసీలకు అండగా అనునిత్యం పోరాడే ఎర్రజెండా పార్టీ సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లం సుబ్బమ్మ, దేసయ్య తదితరులు పాల్గొన్నారు.

**రామాపురంలో...**

**విఆర్.పురం :** మండలంలోని రామాపురం గ్రామంలో శనివారం సిపిఎం విఆర్ పురం మండల నాయకులు ప్రచారం నిర్వహించారు. స్థానికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిత్యం ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తూ ప్రజల కోసమే పనిచేస్తున్న సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి లోత రామారావును, ఎంపీ అభ్యర్థి పి.అప్పలనర్సను గెలిపించుకుంటే గిరిజనుల సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, రామాపురం గిరిజనులు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా శారదా నికేతన్ వార్షికోత్సవం

**విలువైన విద్యను అందించడమే లక్ష్యం**
**శారదా నికేతన్ వ్యవస్థాపకులు సిహెచ్.నర్సింగరావు**

**ప్రజాశక్తి- అరకులోయ :** ఏజెన్సీ ప్రాంతంలో విలువైన విద్యను అందించడమే శారదా నికేతన్ లక్ష్యమని శారధ నికేతన్ వ్యవస్థాపకులు సిహెచ్ నర్సింగరావు తెలిపారు. అరకులోయలోని శారదా నికేతన్ పాఠశాలలో శనివారం 16వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ, పాఠశాలను విజయవంతంగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. మరింత మెరుగు పడే విధంగా విద్యను అందించాలని కోరారు. విద్యను మించిన ఆస్తి లేదని, దీని ప్రాధాన్యతను గుర్తించాలన్నారు. నాణ్యమైన విద్యను అందించి జ్ఞానం పెంపొందించడమే శారదా నికేతన్ ప్రధాన లక్ష్యమన్నారు.

రిటైర్డ్ పంచాయతీరాజ్ శాఖ ఈఈ పల్లం రాజు మాట్లాడుతూ, అత్యంత వెనుకబడి ఏజెన్సీ ప్రాంతంలో శారదా నికేతన్ పాఠశాలను నెలకొల్పి ఆహ్లాదకరమైన వాతావరణంలో స్కూల్‌ను నిర్వహించడం పై అభినందించారు. ఉపాధ్యాయులు గుణాత్మక విద్యను గిరి పుత్రులకు అందించడంతో దేశ భవిష్యత్తుకు పునాది వేసిన వారు అవుతారని తెలిపారు.గుణాత్మకమైన విద్య అందించడంతో సమాజానికి మేలు జరుగుతుందన్నారు.

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుండే సత్ప్రవర్తన, శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించే విధంగా, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు విద్యను అందించాలని ఆయన ఆకాంక్షించారు.

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి బి.ప్రభావతి మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలోని బాలబాలికలకు విద్యను అందించడమే శారద లక్ష్యమన్నారు. తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యను అందిస్తున్నారని తెలిపారు. అందరి సహకారంతో శారదా ట్రస్ట్ నడుస్తుందని పేర్కొనానన్రు.

ప్రిన్సిపాల్ చిరంజీవి మాట్లాడుతూ, 2007లో ప్రారంభమైన ఈ పాఠశాల మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించిందన్నారు. మొదటగా 171 మంది పిల్లలతో ప్రారంభమైన శారధి నికేతన్ నేడు ఎల్ కే జీ టు టెన్త్ వరకు 930 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని ఆయన వివరించారు. చదువుతోపాటు అనేక సామాజిక కార్యక్రమాలు, మెడికల్ క్యాంపు పాలిటెక్నిక్ కోచింగ్ వంటివి కూడా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

డాక్టర్ రమేష్ మాట్లాడుతూ, విద్యార్థి స్థాయిని గుర్తించి చదువు చెప్పాలని ఆయన సూచించారు. ముందుగా డి. శారద చిత్రపటానికి ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డి.శారదా కుమార్తె సుమిత్ర జ్యోతి ప్రజ్వలన చేశారు.





నృత్యం చేస్తున్న విద్యార్థులు




శారద చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సిహెచ్ నర్సింగరావు, తదితరులు

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శారదా నికేతన్ 16వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అల్లరింపచేసాయి. ఎల్‌కేజీ పిల్లల నుంచి టెన్త్ క్లాస్ పిల్లల వరకు వేసిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్ చిరంజీవి అధ్యక్షత వహించని కార్యక్రమంలో ఆ పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు కిల్లో సురేంద్ర, వి.ఉమామహేశ్వరరావు, జెవి స్వామి, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి జి. రమణ, టి.రత్నాలమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నీటి నిలుపుదలకు స్విచ్ ఆఫ్ చేస్తున్న చీఫ్ ఇంజనీర్ బి. శ్రీధర్

## గోదావరి డెల్టాకు నీరు నిలుపుదల

**ప్రజాశక్తి -సీలేరు**

గోదావరి డెల్టా రబీ పంటలకు డొంకరాయి జలాశయం నుండి విడుదల చేస్తున్న నీటిని శనివారం సాయంత్రం నిలుపుదల చేశారు. ఈ మేరకు సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్ శనివారం స్విచ్ ఆఫ్ చేశారు. దీనిపై దిగువ సీలేరు డొంకరాయి ఈఈ సివిల్ విజయ్ కుమార్ ప్రజాశక్తితో మాట్లాడుతూ గోదావరి డెల్టాకు రబీ పంటకు డొంకరాయి జలాశయం 2 గేట్ల ద్వారా ఈనెల ఒకటి నుంచి 13వ తేదీ వరకు మొత్తం 4248.090 టీఎంసీలు నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. ఈనెల ఒకటి నుంచి ప్రతిరోజు గేట్లు ద్వారా 3,500 క్యూసెక్కులు, సీలేరు కాంప్లెక్స్‌లో విద్యుత్ ఉత్పత్తి అనంతరం మరో 3500 క్యూసెక్కులు కలుపుకొని మొత్తం 7000 క్యూసెక్కులు నీటిని ఇరిగేషన్ అధికారులు కోరిన విధంగా గోదావరి డెల్టాకు నీటి విడుదల చేసినట్లు తెలిపారు. వారు కోరిన గడువు ముగియడంతో ఏపీ జెన్కో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డొంకరాయి జలాశయం గేట్లు ద్వారా నీటి విడుదలని నిలిపివేసామన్నారు. సీలేరు కాంప్లెక్స్‌లో జనరేషన్ అనంతరం ప్రతిరోజు 3500 క్యూసెక్కుల నుంచి సుమారుగా 4000 క్యూసెక్కుల వరకు గోదావరిలో చేరుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఈ బాలకృష్ణ, ఏఈ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం

## అసంపూర్తిగా అంగన్వాడీ భవనం

**ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని పనులు**

**ప్రజాశక్తి-దుంబ్రిగుడ:** ప్రభుత్వం మంజూరు చేసిన అంగన్వాడి కేంద్రం భవనాన్ని నిర్మించడంలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో ఏళ్లు గడుస్తున్నా అసంపూర్తిగానే మిగిలిపోతున్నాయి. దీంతో లక్షలాధి రూపాయల నిధులు ప్రభుత్వం మంజూరు చేసినా ఉపయోగం లేకుండా పోతోంది.

మండలంలోని కురిడి పంచాయతీ గడబగల్లుంగులో 2018లో ప్రభుత్వం అంగన్వాడి భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. దీంతో, భవనం పిల్లర్లు నిర్మించి స్లాబు వేసి అసంపూర్తిగా వదిలేశారు. భవనం పనులు పూర్తి కాకపోవడంతో అంగన్వాడి కేంద్రం నిర్వహణను ఓ నివాస గృహంలో కొనసాగిస్తున్నారు. ఈ గృహం వద్ద చిన్నారులకు ఆటపాటలు నేర్పించడానికి స్థలం సరిపోక నిర్వాహకులు, చిన్నారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. అంగన్వాడి భవనాన్ని పూర్తి చేయాలని పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తిచేయాలని గిరిజనులు కోరుతున్నారు.

## రెసిడెన్షియల్ కాలేజీ విద్యార్థుల సత్తా

**ప్రజాశక్తి- పెదబయలు :** స్థానిక రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చారు. 2023- 24 విద్యా సంవత్సరానికి గాను మొదటి సంవత్సరం 189 మందికి గాను 156, 82.54శాతం, ద్వితీయ సంవత్సరానికి గాను 185 మందికి గాను 173, 93.51శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ ఈశ్వరమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

**గ్రూప్ 1 ప్రిలిమ్స్‌లో**

## గిరిజన అభ్యర్థుల ప్రతిభ

**ప్రజాశక్తి -పాడేరు:** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్ 1 ప్రిలిమ్స్ లో ఇద్దరు గిరిజన విద్యార్థులు సత్తా చాటారు. సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ. ఆధ్వర్యంలో 21 సెంచరీ ఎడ్యుకేషన్ సొసైటీ అందిస్తున్న సివిల్స్ మొదటి బ్యాచ్‌లో శిక్షణ పొందిన సీదరి శ్రీనివాస్, ఈ ఏడాది శిక్షణ పొందుతున్న గుజ్జెలి కమల్ భార్గవ్ మార్చి నెలలో జరిగిన గ్రూప్ 1 ప్రిలిమ్స్ లో ప్రతిభ కనబరిచి గ్రూప్ 1మెయిన్స్ కు అర్హత సాధించారు. మెయిన్స్ కు అర్హత సాధించిన శ్రీనివాస్, కమల్ భార్గవ్‌లను ఐటిడిఏ ప్రాజెక్ అధికారి వి. అభిషేక్, 21వ సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీ కరస్పాండెంట్ సెక్రటరీ కె.ధరణి అభినందించారు. వీరిద్దరూ ఎస్పై ఉద్యోగాలు సాధించారని ధరణి తెలిపారు. సివిల్స్‌లో ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు.

# జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం

**-హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయని కాంట్రాక్టర్లు**
**-పలు ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు**

**ప్రజాశక్తి -అడ్డతీగల**

అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ పరిధిలో జరుగుతున్న 516ఇ జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. పలు చోట్ల కల్వర్టులు నిర్మాణం చేస్తుండగా, వాటి వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం లేదు. దీంతో టూ వీలర్, ఫోర్ వీలర్ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా సంబంధిత హైవే అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. కల్వర్టులు నిర్మాణాల దగ్గర హెచ్చరిక బోర్డులు పెట్టకపోవడంపై కొంతమంది వాహనదారులు పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యమని విమర్శలు వినిపిస్తున్నాయి.

రాజవొమ్మంగి మండలంలో కల్వర్టు నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతంలో ఓ ద్విచక్ర వాహనదారుడు నేరుగా కల్వర్టులో పడి తీవ్ర గాయాలైన సంఘటన ఇటీవల చోటుచేసుకుంది. ఇటువంటి సంఘటనలు మరికొన్ని ప్రాంతాల్లో కూడా జరిగాయి. అయినా సంబంధిత కాంట్రాక్టరుగాని, అధికారులుగాని స్పందించలేదు. ప్రస్తుతం భీముడుపాకలు గ్రామ సమీపంలోనూ, చేనుపాకలు గ్రామ చివరి ప్రాంతంలోనూ కల్వర్టుల నిర్మాణం జరుగుతున్నా ఎక్కడా హెచ్చరిక బోర్డులు లేవు.

ఈ నెల 12న శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో స్థానిక కరెంట్ ఆఫీస్ దగ్గరలో జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డు పక్కనే ఉన్న చెట్లను తొలగిస్తుండగా, చెట్టుకొమ్మ వాహనంపై ధ్వంసమైంది. దీనిపై స్థానికులు ప్రశ్నించడానికి వెళ్లగా... వారి లోపాలు ఎక్కడ బయటపడతాయోనని వారు అక్కడ నుండి ఉడాయించారు. రోడ్డు, కల్వర్టుల నిర్మాణం, చెట్లు తొలగింపు, కాంక్రీట్ వేసే విధానం ఇలా ప్రతి పనిలోనూ డొల్లతనం కనబడుతుంది. వీటిపై ఎవరిని అడిగినా సరైన సమాధానం చెప్పే నాధుడే లేడు. అక్కడ పని చేసే వర్కర్లు అర్థం కాని భాషలో మాట్లాడుతూ సమస్యలను దాటవేస్తున్నారు. సమస్యలు పరిష్కారానికి కాంట్రాక్టర్‌గాని, సంబంధిత అధికారులుగాని ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



ప్రొక్లెయినర్‌పై పడిన చెట్టు కొమ్మలు



దోమల నివారణ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

## దోమల నివారణకు చర్యలు

**ప్రజాశక్తి-రాజవొమ్మంగి**

మండలంలోని రాజవొమ్మంగి పిహెచ్సి పరిధిలో దోమల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు ఆ పిహెచ్సి వైద్యాధికారి నాగార్జున తెలిపారు. స్థానిక పిహెచ్సిలో శనివారం మలేరియా నివారణ యూనిట్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మలేరియా నిర్మూలన కార్యక్రమాల్లో భాగంగా ఆయా గ్రామాల్లో అన్ని గృహాల్లో దోమల నివారణ మందును తప్పనిసరిగా పిచికారి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో మలేరియా మందు పిచికారి చేసే క్రమంలో గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సిహెచ్ ప్రసాదు, సోమరాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం

**రైతు సంఘం నాయకులు ఆవుల మురళి**

**ప్రజాశక్తి-కూనవరం**

ప్రతి ఏటా వరదలు వచ్చి నష్టపోతున్న రైతంగాన్ని ఆదుకోవడంలో కేంద్ర బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని రైతు సంఘం నాయకులు ఆవుల మురళి విమర్శించారు. స్థానిక సీపీఎం. కార్యాలయంలో కర్నాటి శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో మురళి మాట్లాడుతూ రైతులకు పంట నష్టం పరిహారం నేటికీ ఇవ్వలేదన్నారు. పట్టా భూములు ఉన్న రైతులకు సొసైటీల ద్వారా, బ్యాంకుల ద్వారా అప్పులు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. పండించిన పంటలను అమ్ముకోవడానికి దగ్గర్లో మార్కెట్ సదుపాయం కల్పించడం లేదన్నారు. పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు వ్యవసాయ పరికరాల సబ్సిడీలు ఇవ్వడం లేదన్నారు. మరోవైపు రైతులకు, వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం జరిగే చట్టాలను బీజేపీ ప్రభుత్వం తెస్తుంటే, వైసీపీ ప్రభుత్వం వాటికి మద్దతు ఇస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, తాళ్లూరి శ్రీనివాసరావు, సర్పంచ్ బొగ్గా వెంకమ్మ, నాగమణి, పొద్దయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్నరైతు సంఘం నాయకులు మురళి

## సిపిఎం కార్యకర్తకు నాయకుల పరామర్శ

**ప్రజాశక్తి-విఆర్.పురం**

మండలంలోని చోప్పల్లి గ్రామ సిపిఎం సభ్యులు కారం జానకిరామ్ ఇటీవల పేరాలసిస్ రావడంతో వైద్యం పొంది ఇంటి వద్ద కోలుకుంటుండగా ఆయన్ను శనివారం విఆర్.పురం మండల సిపిఎం నాయకులు పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ కారం లక్ష్మి, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు పంకు సత్తిబాబు, వడ్లాది రమేష్, కారం సుందరయ్య, ఆసు లక్ష్మయ్య, గుండెపూడి లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.



పెరాలసిస్‌తో బాధపడుతున్న జానకిరామ్‌ను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

## మాడుగుల సీటుపై పునరాలోచించాలి

### మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు

ప్రజాశక్తి - చీడికాడ: మాడుగుల నియోజకవర్గంలో తెలుగుదేశం బిజెపి జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన సీటుపై అధిష్టానం సర్వేలు జరిపించి ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు కోరారు. మండలంలోని అప్పలరాజుపురం గ్రామంలో పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, మాడుగుల నియోజకవర్గంలో 111 పంచాయతీల్లో నాయకులు, కార్యకర్తలు, ఓటర్లతో సర్వేలు జరిపించి బలమైన నాయకుడికి ఎమ్మెల్యే సీటును ప్రకటించాలని రామానాయుడు అభ్యర్థించారు. గతంలో ఈ టికెట్ పై చంద్రబాబును సంప్రదిస్తే పార్టీని బలోపేతం చేసిన నాయకుడికి ప్రతిపాదించి చెప్పారని, ఎటువంటి సర్వేలు జరపకుండా పార్టీతో సంబంధం లేకుండా ఎత్తులు వేసే నాయకుడికి టికెట్ ప్రకటించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అధిష్టానం నిర్ణయం మేరకు నియోజకవర్గంలో బాదుడే బాదుడు, రాష్ట్రానికి ఇదేం కర్మ, బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాల్లో కాకుండా అనేక నిరసనలు చేపట్టి నియోజకవర్గంలో పార్టీకి ఊపిరి పోశానన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలలో చైతన్యం వచ్చిందని, ఈ తరుణంలో తనను కాదని గుర్తింపు లేని నాయకుడికి ఎమ్మెల్యే సీటు ప్రకటించడంతో పార్టీ ఉనికిని కోల్పోతుందని తెలిపారు. ఈ నెల 15న నియోజకవర్గ స్థాయిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తానని రామానాయుడు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి సన్యాసినాయుడు, సర్పంచ్ కొల్లి సూర్య నాయుడు, ఎంపీటీసీ ముత్యాల నాయుడు, రైతు సంఘం నాయకుడు గొబ్బెల్లి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

## ఘనంగా మరిడిమహాలక్ష్మి రాట ఉత్సవం

ప్రజాశక్తి -అనకాపల్లిడెస్క్: నర్సీపట్నంలో ఈ నెల 23న నిర్వహించే మరిడి మహాలక్ష్మీ అమ్మవారి జాతర సందర్భంగా శనివారం రాట మహోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి పద్మావతి చేతుల మీదుగా రాటను వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఈనెల 15న మొదటి జాగారం, 17న రెండవ జాగారం, 19న పెద్ద జాగారం నిర్వహిస్తామన్నారు. 23న అత్యంత ఘనంగా జాతరను నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

## నక్కపల్లికి చేరుకున్న ఇవిఎంలు

ప్రజాశక్తి -నక్కపల్లి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పాయకరావుపేట నియోజకవర్గానికి సంబంధించి అవసరమైన ఈవీఎంలను పటిష్ట బందోబస్తు మధ్య శనివారం సాయంత్రం నక్కపల్లికి తీసుకువచ్చారు. ప్రత్యేక వాహనంలో 350 బ్యాలెట్ యూనిట్లు, 350 కంట్రోల్ యూనిట్లు, 379 వివి ప్యాట్లు నక్కపల్లికి చేరుకున్నాయి. ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె. గీతాంజలి పర్యవేక్షణలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ లో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ పున్న బాక్సులను భద్రపరిచారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద రౌండ్ ది క్లాక్ పోలీస్ బందోబస్తు వుంటుందని ఆర్వో గీతాంజలి, సీఐ విజయ్ కుమార్ తెలిపారు. పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల సమక్షంలో ఈ బాక్సులను స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ఓ శ్రీకాంత్, ఎలక్షన్ డీటీ చైతన్య, హెచ్ వీ సత్యనారాయణ, టీడీపీ, బీజేపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, కోసూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే సమాజంలో సాధికారత, సమానత్వం : ఏయూ రిజిస్ట్రార్

ప్రజాశక్తి - విశాఖపట్నం : విద్యతోనే సమాజంలో ప్రజల సాధికారత, సమానత్వం సాకారం అవుతాయని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. శనివారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఛైర్ ఫర్ పీస్, ఇన్నర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్, రేడియంట్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు 'డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ థాట్స్ ఆన్ ఎడ్యుకేషన్, సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్'లో పాల్గొని కీలకోపన్యాసం చేశారు. వర్తమాన విధానంలో సదస్సులో పాల్గొని మాట్లాడుతూ, దేశం ఆర్థికంగా, పారిశ్రామికంగా అభివృద్ధి సాధించాలని అంబేద్కర్ కోరుకున్నారన్నారు. నేడు డిజిటల్ ఇండియాతో ప్రజలందరికీ సేవలు చేరువ అవుతున్నాయని తెలిపారు. గ్రామీణ భారతావనిని అనుసంధానం చేయడానికి డిజిటల్ ఇండియా వారధిగా నిలుస్తోందని తెలిపారు. అందరికీ సమానంగా అవకాశాలు అందుతున్నాయన్నారు. నాడు అత్యంత ఆదరణ, ఆదాయం కలిగిన న్యాయవాద వృత్తికంటే దేశానికి ఉపయుక్తంగా నిలిచే ఎకనామిక్స్ ను చదవడానికి ముందుగా ఆసక్తి చూపిన అంబేద్కర్ దార్శనికత మనం అర్థం చేసుకోవాలని సూచించారు.

# ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం

### ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం

ప్రజాశక్తి-పాడేరుటౌన్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికారులు సిద్ధమయ్యారు. అరకు పార్లమెంట్ తో పాటు మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మే 13న పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో విడుదల కాబోతుంది. ఆ రోజు నుంచే నామినేషన్ ప్రక్రియ ఆరంభం కానుంది. ఈలోపే ఎన్నికల నిర్వహణకు వీలుగా అధికారులు చకచకా ఏర్పాట్లకు దిగారు. కీలక ప్రాంతాల్లో చెక్ పోస్టులతో నిఘా పెంచారు. పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలను ఠశల వారీగా పరిశీలిస్తున్నారు. పోలింగ్ నిర్వహణ సిబ్బంది నియామకం పూర్తి కావొస్తుంది. మొత్తం మీద ఎన్ని కలు నిర్వహణపైనే యంత్రాంగం యావత్తు మోహరించింది. మరోవైపు రాజకీయ పార్టీలు ప్రచారాలతో పాటు ఏజెంట్ల నియామకం, ఓట్ల జాబితాల పరిశీలనలో తలమునకలై ఉన్నాయి.

**కౌంటింగ్, పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు**

ఎన్నికల నిర్వహణ అంటే సాధారణ బాధ్యత కాదు. ఉమ్మడి బాధ్యత ఈ దిశగా అధికార యంత్రాంగం నిర్వహణ ఏర్పాట్లలో తలమునకలై ఉంది. ఇప్పటికే రాజకీయ పక్షాలతో సమావేశం నిర్వహించి ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలు, వాటి నిర్వహణపై ముందస్తుగా వివరాలు అందించారు. తెలుగుదేశం, జనసేన, బిజెపి, వైసిపి, వామపక్షాలు, కాంగ్రెస్ తో సహా అన్నిపార్టీలు ఈ అంశాల్లో పూర్తి అప్రమత్తంగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 1081 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వీటి నిర్వహణ పోలింగ్ నాడు అవసరమైన ఏర్పాట్లపై రిటర్నింగ్ అధికారులంతా ఇప్పటికే ప్రత్యేక పరిశీలన చేశారు. ఎక్కడెక్కడ లోటు పాట్లు ఉన్నవి గమనించి దిద్దుబాటు చర్యలకు దిగారు. కౌంటింగ్ వచ్చేసరికి జిల్లా కేంద్రం పాడేరులోని తలారిసింగి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో రంపచోడవరం నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అరకు, పాడేరు నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు కేంద్రాలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎంపిక చేశారు. ఈనెల 18 తర్వాత 25వ తేదీ వరకు నామినేషన్ల పర్వం ఆరంభం కానుంది. నామినేషన్ స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేశారు. అసెంబ్లీ నియోజక వర్గాల నామినేషన్లను ఇప్పటికే గుర్తించిన నియోజకవర్గ కేంద్రాల్లోనూ స్వీకరిస్తారు. జిల్లాలో ఇప్పటివరకు 7,65,397 మంది ఓటర్లు ఉండగా, 1081 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణకు వీలుగా పాడేరు ఏజెన్సీ 11 మండలాల వ్యాప్తంగా దాదాపు పిఒ, ఎపిఒలు కలిపి 1947 మందికి నియామకం చేశారు. ఇతర పోలింగ్ అధికారులు ఉన్నారు. శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

# ఇంటర్‌లో మోడల్, జూనియర్ కళాశాలల సత్తా

ప్రజాశక్తి-గొలుగొండ: శుక్రవారం విడుదలైన ఇంటర్ పరీక్షా ఫలితల్లో కృష్ణదేవిపేట జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాలలో ఎంపీసీ గ్రూపుకు సంబంధించి రామోజు భారతి (951), షేక్ తసీఫా (949), కొప్పోజు ప్రసన్న సాయిదుర్గ (810) ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాలలో ఎంపీసీ గ్రూపుకు సంబంధించి టి.వరలోవ శంకర్ (436), బైపీసీ గ్రూపుకు సంబంధించి జె. నీలిమ (396), సిహెచ్. సుస్థిరం (394) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు హాజరైన 98 మంది విద్యార్థులకు గాను 28 మంది, ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరైన 109 మందికి 79 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీహరి తెలిపారు.

**వేములపూడి కళాశాల విద్యార్థుల సత్తా**

అనకాపల్లిడెస్క్: ఇంటర్మీడియేట్ పరీక్షా ఫలితాల్లో నర్సీపట్నం మండలం వేములపూడి ఏపి మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కెవిఎస్.సంధ్య మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 81 శాతం, ద్వితీయ సంవత్సరంలో 79 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపిసి విభాగంలో 470 మార్కులకు గాను 460, 443, 437, 432 మార్కులు, బైపిసి విభాగంలో 440 మార్కులకు గాను 426, 422, 421, 420, 418 మార్కులు, సిఇసి విభాగంలో 500 మార్కులకు గాను 381 మార్కులు సాధించినట్లు చెప్పారు. అలాగే ద్వితీయ సంవత్సరం ఎంపిసి విభాగంలో 1000 మార్కులకు గాను 922, బైపిసి విభాగంలో 948, సిఇసి విభాగంలో 835 మార్కులు గరిష్టంగా సాధించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

అనకాపల్లిడెస్క్: ఒకేషనల్ కోర్సు (ఒకేషనల్) ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో నర్సీపట్నం సాన్ ఒకేషనల్ కళాశాలకు చెందిన భాముల సౌమ్య 941/1000 మార్కులతో జిల్లా ఫస్ట్‌గా నిలిచింది. అదే కళాశాలకు చెందిన రుత్తల దివ్య 868/1000 మార్కులతో జిల్లా సెకండ్‌గా నిలిచిందని కరస్పాండెంట్ సూరెడ్డి ఉమామహేశ్వర్ తెలిపారు.

# వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని గొడిచెర్ల, జి.కొత్తూరు, డి.కొత్తూరు గ్రామాల్లో శనివారం పాయకరావుపేట నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు పార్టీ శ్రేణులతో కలిసి ముమ్మరంగా ప్రచారం చేపట్టారు. ఎన్నికల ప్రచారంలో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు పాల్గొని గ్రామంలో పర్యటించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, పార్టీ మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జీ, నాయకులు అల్లు రమణ, నల్లల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిడెస్క్: సంక్షేమ పాలన కోసం వైసీపీకి మద్దతు ఇవ్వాలని నర్సీపట్నం వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. శనివారం నర్సీపట్నం మున్సిపాలిటీ 7, 8 వార్డుల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేస్తూ వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. అనంతరం గణేష్ విలేకరులతో మాట్లాడుతూ అయ్యన్నపాత్రుడు ఎంత సేపు వందల కోట్ల సంపాదించడంపైనే దృష్టి పెట్టారు కాని నియోజకవర్గంలో అధిక జనాభా గల పెద్ద మండలంగా ఉన్న నాతవరంలో జూనియర్ కళాశాలను తీసుకురావాలనే ఆలోచన చేయలేదన్నారు. కాని వైసీపీ హయాంలో జూనియర్ కళాశాల మంజూరు అయిందన్నారు. నర్సీపట్నం నియోజకవర్గం 30వేల మెజార్టీతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, వైసిపి మున్సిపాలిటీ అధ్యక్షులు ఏకా శివ, జగనన్న సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

### వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి - అరిలోవ : నగరంలో వరుస హత్యలు కలకలం రేపుతున్నాయి. అరిలోవ పోలీస్ స్టేషన్ పరిధి 13వ వార్డు శ్రీకృష్ణాపురంలోని ఒక నిర్మానుష్య ప్రదేశంలో ఓ వ్యక్తిని దారుణంగా హతమార్చారు. శ్రీకృష్ణాపురం ఎదురుగా శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో చిన్నకాలువలో రాళ్ల మధ్య మృతదేహం ఉండడాన్ని స్థానిక యువకులు గుర్తించారు. అరిలోవ పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సిపి డాక్టర్ రవిశంకర్ అయ్యర్, ఎసిపి జయరాం ప్రసాద్, అరిలోవ సిఐ గోవిందరావు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోలీసు జాగిలాలతో పరిసర ప్రాంతాల్లో తనిఖీ చేశారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఈ హత్య జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని కాలువ నుంచి బయటకు తీశారు. అరిలోవ కాలనీ వెల్చిదుర్గానగర్‌కు చెందిన దనాల అమర్(35)గా గుర్తించారు. శుక్రవారం రాత్రి 8 గంటలకు బయటకు వెళ్లిన అమర్ ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. అమర్ గతంలో జివిఎంసి ఒప్పంద పద్ధతి డ్రైవర్‌గా పనిచేసేవాడు. అరిలోవ పోలీస్‌స్టేషన్‌లో అతనిపై ఎటువంటి కేసులూ లేవని ప్రాథమిక సమాచారం. స్థానికంగా యువకులతో పెద్ద పాలయింగ్ ఉన్న వ్యక్తి. యువకుల మధ్య చిన్న చిన్న గొడవల్లో తలదూర్చి సెటిల్ మెంట్లు చేయడం తప్ప అందరితో మంచిగా ఉండేవాడని స్థానికులు అంటున్నారు. అరిలోవ సిఐ గోవిందరావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్ శవాగారానికి తరలించారు.

### ఐదుగురు జూదరుల అరెస్టు

ప్రజాశక్తి -మునగపాక : మండలంలోని చూచుకొండ గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. శనివారం తమకు అందిన సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి జూదరులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి రూ.8 లక్షల 76 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

### 700 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏటిగైరంపేట పంచాయతీ మంగ్గరపాలెం గ్రామం శివారు పొలిమేరలో సారా బట్టీలపై ఎస్ఐ బి.కృష్ణారావు శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి ఉపయోగించే 700 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎక్కడైనా సారా తయారు చేసినా, విక్రయించినా సమాచారం ఇవ్వాలని చెప్పారు.

## ఏయూను సందర్శించిన అంగోలా ప్రతినిధులు

ప్రజాశక్తి -విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని అంగోలా దేశానికి చెందిన ప్రతినిధులు, అధికారులు సందర్శించారు. ముందుగా ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డితో భేటీ అయ్యారు. ఏయూలో తమ దేశ విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందిస్తున్న విధానం అడిగి తెలుసుకున్నారు. ఏయూతో తమ అనుబంధం మరింత బలోపేతం చేస్తామన్నారు. ఎంబసీ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ అంగోలా మిషా కాన్సులర్ జి.ఎ.ఫ్రాన్సిస్కో, ఎంబసీ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ అంగోలా కౌన్సిలర్ ఆఫోన్సో జోస్ తో కూడిన బృందం ఏయూలో విద్యనభ్యసిస్తున్న అంగోలా విద్యార్థులతో సమావేశమయ్యారు. ఏయూలో కల్పిస్తున్న వసతులు, బోధన తదితర అంశాలను విద్యార్థులనడిగి తెలుసుకున్నారు. ఏయూలో నాణ్యమైన విద్యను అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఇఎన్.ధనంజయరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా యూనివర్సిటీ ఛాంపియన్‌గా గీతం జట్టు

ప్రజాశక్తి -మధురవాడ : భోపాల్‌లోని సెజ్ యూనివర్సిటీలో ఆల్ ఇండియా యూనివర్సిటీ ఛాంపియన్ షిప్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన వాలీబాల్ పోటీలలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం జట్టు మొదటి స్థానం సాధించి ఆల్ ఇండియా యూనివర్సిటీ ఛాంపియన్‌గా నిలిచిందని క్రీడా విభాగం డైరెక్టర్ డాక్టర్ యు.విజయకుమార్ తెలిపారు. గీతం విద్యార్థులు గోలి సుజిత్, ఎస్.రోహిత్‌రాజ్, జి.సాయికార్తిక్, కె.హర్షిద్, ఎపి.సాయి శశిధర్, ఎన్.జి.గణేష్ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం నిలిచి బంగారు పతకాలను సాధించారని పేర్కొన్నారు. ఈ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో గీతం జట్టు చండీగఢ్ యూనివర్సిటీని బెస్ట్ ఆఫ్ 3 ఫైనల్‌లో 2-0 స్కోర్‌తో ఓడించిందని వివరించారు. వాలీబాల్ జట్టుకు టీమ్ మేనేజర్‌గా రితేష్ సిన్హా వ్యవహరించారని తెలిపారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న జమాల్‌ఖాన్ తదితరులు

## వృద్ధులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి- కూనవరం : కృష్ణార్పణ ఫౌండేషన్ 11వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక స్వామి వివేకానంద స్కూల్లో వృద్ధులకు అన్నదానం చేసి, దుస్తులు పంపిణీ చేశారు. ఇందులో ముఖ్య అతిథిగా ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ విచ్చేసి ఆయన చేతుల మీదుగా వృద్ధులకు వస్త్రదానం చేశారు. ఈ సందర్భంగా జమాల్ ఖాన్ మాట్లాడుతూ కాకునూరు కృష్ణార్జున ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఎప్పుడైనా సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం జమాల్ ఖాన్ ను, ప్రభుత్వ వైద్యులు బాషా, జీవన్ కుమారులను సంస్థ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూఫీ, వనమా భాగ్యలక్ష్మి, నోముల శ్రీనివాసరావు, బాగుల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దక్షిణంలో వంశీకృష్ణ శ్రీనివాస్‌ను మార్చాలి

### - జనసేన కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజక వర్గంలో కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రచారంలో వెనుకబడి పోయారని, ఆయనకు గెలిచే అవకాశం లేదని, వెంటనే అభ్యర్థిని మార్చాలని 39వ వార్డు జనసేన కార్పొరేటర్ మహ్మద్ సాదిక్ పేర్కొన్నారు. విశాఖ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో, ఆయన మాట్లాడుతూ, దక్షిణంలో సర్వేలు వంశీకి ప్రతికూలంగా ఉన్నాయన్నారు. వంశీ దక్షిణంలో నాన్ లోకల్‌గా ప్రచారం సాగుతోందన్నారు. దీంతో జనసేన గెలవాల్సిన స్థానంలో ఓడిపోవాల్సిన దుస్థితి దాపురించిందని విచారం వ్యక్తం చేశారు. సానుభూతి కోసం పవన్ కల్యాణ్‌ను మోసం చేసినట్లు ఆధిష్టానానికి వివరించానని గుర్తు చేశారు. ప్రజలు ఆయనను నమ్మే పరిస్థితి లేదన్నారు. ఆయన సొంతవాళ్లు దక్షిణ నియోజక వర్గం టికెట్ సమర్థులకే కేటాయించాలని కోరారు. 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తారని, మత్స్యకార సెల్ నేత మాగి శ్రీనివాసరావు జనసేన పార్టీకి రాజీనామా చేసే యోచనలో ఉన్నారన్నారు. సరైన అభ్యర్థికి టికెట్ ఇవ్వాలని కోరారు. మీడియా సమావేశంలో దక్షిణ నియోజకవర్గం జన సేన నేతలు సూరాడ తాతారావు, అర్జిల్ల మసేను, మత్తుల్ల ఖాన్, ఎండి సలీం, బుక్కారీ ఖాన్, మోతి భాయ్, రాణి భాను, పి.రమ, షేక్ అబిదా, కనక మహాలక్ష్మి, బొద్ది అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

### శ్రీరామ నవమి రాట

ప్రజాశక్తి -సీలేరు : జికె వీధి మండలం సీలేరు రామాలయం సెంటర్లో శ్రీరామ నవమి వేడుకలకు ముహూర్తపురాట శనివారం వేశారు. పిల్లా రమణ దంపతులు పీటలపై కూర్చుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరామనవమి ప్రధాన వేడుక ఈనెల 17న నిర్వహించనున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తుంది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### 87వ రోజుకు ఎంవివి పాదయాత్ర

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ: తూర్పు నియోజకవర్గంలో శనివారం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి సత్యనారాయణ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయన పాదయాత్ర 87వ రోజు విశాఖ సెంట్రల్ జీవీఎంసీ 19వ వార్డు పాండురంగాపురం, శివాజీ నగర్‌లో చేపట్టారు. ఈ సందర్భంగా ఎంవివి సత్యనారాయణ మాట్లాడుతూ, ఆర్థికంగా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిఅందించారన్నారు. వార్డులో కొట్ల రూపాయలు అభివృద్ధి పనులు చేశారన్నారు. తూర్పు నియోజకవర్గంలో ప్రచారానికి గాను ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఇన్‌ఛార్జ్ నెక్కంటి వెంకటలక్ష్మి దాస్, మహిళలు పార్టీ శ్రేణులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మహిళలు పార్టీ శ్రేణులు, అభిమానులు, పలు కార్పొరేషన్ డైరెక్టర్లు చైర్మన్లు పాల్గొన్నారు.

# అమల్లోకి చేపల వేట నిషేధం

### రేపటి నుంచి ఒడ్డుకే బోట్లు పరిమితం
### కొత్త ప్రభుత్వం కొలువుదీరాకే పరిహారం ?
### 61 రోజులపాటు మత్స్యకారుల ఉపాధికి ఇబ్బంది

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, అనకాపల్లి ప్రతినిధి

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సముద్రంలో చేపల వేట నిషేధం ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు అమలుకానుంది. చేపల వేట నిషేధ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం, మత్స్యకారుల పరిహారం చెల్లింపుపై మాత్రం ఇంతవరకు స్పష్టమైన ఆదేశాలివ్వలేదు. చేపలవేటపై ఆధారపడ్డ మత్స్యకారుల గుర్తింపు జాబితా తయారీకి చర్యలు చేపట్టలేదు. 61 రోజుల పాటు చేపల వేట నిషేధం అమలుకాబడడంతో సముద్రంలో మెకనైజ్డ్, మోటర్ బోట్లతో చేపల వేటకు వెళ్లే అవకాశం మత్స్యకారులకు లేదు. దీంతో వారి ఉపాధికి దెబ్బ పడనుంది.

వాస్తవానికి మే నెలలో వేట నిషేధ పరిహారం ఒక్కొక్క మత్స్యకారునికి రూ.10 వేలు చొప్పున ప్రభుత్వం ద్వారా మత్స్యకార అభివృద్ధి శాఖ నుంచి అందాల్సి ఉంది. కాని ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది పరిహారం పంపిణీ ఆలస్యం కానుంది. '2024 ఎన్నికల కారణంగా మేలో పరిహారం దక్కే పరిస్థితి లేదు' అని మత్స్యశాఖ విశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ విజయకృష్ణ 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఎన్నికల సంవత్సరం ఎప్పుడూ ఇంతే అంటూ ఆయన సమాధానం చెప్పారు. ప్రభుత్వం మారాల్సి లేదా ఈ ప్రభుత్వమే అధికారంలోకి వచ్చినా నవంబర్‌లో అందజేస్తారని తెలిపారు.

**పరిహారం మాటేంటి ?**

విశాఖ జిల్లా మత్స్యశాఖ అధికారుల రికార్డుల ప్రకారం 10500 మంది మత్స్యకారులు చేపలు వేటాడతారు. ఈ జాబితా ప్రకారం గడచిన ఏడాది రూ.10.50 కోట్లు మత్స్యకారుల ఖాతాల్లో జమ అవుతుంది. ఈసారీ అంతే జమ కానున్నట్లు సమాచారం. జిల్లాలోని జాలారిపేట, రుషికొండ, సాగర్‌నగర్, పెద జాలారిపేట, వాల్తేరు, భీమునిపట్నం తదితర చోట్ల నుంచి వేటకు వెళ్తుంటారు. చేపల వేట నిషేధ కాలంలో ఇబ్బందులు పడనున్నారు.



జెట్టీ వద్ద నిలిపిన బోట్లు

అనకాపల్లి జిల్లాలో 73 కిలోమీటర్ల తీర ప్రాంతంలో 32 తీర గ్రామాలున్నాయి. 2,238 మోటార్ బోట్లలో సముద్రంలో చేపల వేటకు దాదాపు 15 వేల మంది మత్స్యకారులు వెళ్తున్నారు. వేట నిషేధంతో వీరి రోజువారీ ఆదాయానికి గండిపడినట్లయింది. నిషేధిత కాలానికి కుటుంబానికి చెల్లించే పదివేల రూపాయలు ఎప్పుడు చెల్లించేది ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఎన్నికల సమయంలో చేపల వేట నిషేధ కాలానికి సకాలంలో భృతి చెల్లింపు ప్రశ్నార్థకంగా మారనుంది. మత్స్యకారులు గుర్తింపు, జాబితా తయారీ, నిధులు విడుదల సరిగా జరగకపోతే మత్స్యకారులకు నష్టం జరగనుంది. గతేడాది జిల్లాలో 10,750 కుటుంబాలకు పదివేల రూపాయలు చొప్పున జీవనభృతి కింద ప్రభుత్వం చెల్లించింది. ఈ ఏడాది ఇంకా ప్రభుత్వం నుంచి పరిహారం చెల్లింపుపై ఉత్తర్వులేవీ రాలేదని మత్స్యశాఖ అధికారులు తెలిపారు.

# యుసిడిలో ముగ్గురు సిఒలు సస్పెన్షన్, ఎపిడికి షోకాజ్

### ఎన్నికల విధుల నుంచి తొలగించిన కలెక్టర్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : యుసిడిపై వార్తా పత్రికల్లో వచ్చిన అభియోగాలపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున తీవ్రంగా స్పందించారు. పలువురిపై వేటు వేశారు. నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ కెఎస్.విశ్వనాథన్‌ను జరిగిన ఘటనలపై విచారణ అధికారిగా వేశారు. ఆయన అందించిన నివేదిక ఆధారంగా బాధ్యులందరిపై చర్యలు తీసుకున్నారు. వార్డు నెంబరు 17 సిఒ తిరుమలరావు, వార్డు నెంబరు 18 సిఒ నరసింహులు, వార్డు నెంబరు 19 సిఒ ఎస్‌వి.రమణలను ఈ మేరకు సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే జోన్-3 ఎపిడి దుర్గాప్రసాద్‌కు షోకాజ్ నోటీసు జారీచేస్తూ, ఎన్నికలకు సంబంధించిన విధుల నుంచి తొలగించినట్లు కలెక్టర్ చెప్పారు. వీరితో పాటు ఆర్‌పిలను కూడా వారి పోస్టుల నుంచి తొలగించినట్లు కలెక్టర్ తన ప్రకటనలో శనివారం తెలిపారు.

## ఆకట్టుకున్న నృత్య సంగీతార్చన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కూచిపూడి నృత్యం ద్వారా దేశంలోని 108 శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాల్లో ఆధ్యాత్మిక శత నృత్య సంగీతార్చన పేరిట నాట్య పరిమళ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా 33వ ప్రదర్శన ఐసకతోటలోగల శ్రీ మహాలక్ష్మి సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో చేపట్టారు. అక్కడ నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన, అన్నమాచార్య సంకీర్తన అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్జేయు స్మారక కళాపీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళీధర్ హాజరయ్యారు. అంతర్జాతీయ కూచిపూడి నర్తకురాలు, అకాడమీ డైరెక్టర్ బీఎస్ రెడ్డిశ్రీ పాటు ఆమె వద్ద శిక్షణ పొందుతున్న కళాకారులు తమదైన శైలిలో కూచిపూడి నాట్య విన్యాసాలతో అలరించారు.

## అది 'నారా డిజాస్టర్ అలయెన్స్'

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : టిడిపి అంటే నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్‌గా గతంలో అనేవాళ్లు. అయితే, ఇవాళ ఏపీలో ఎన్‌డిఎను 'నారా డిజాస్టర్ అలయెన్స్' అని 'నారా డిస్ట్రక్టివ్ అలయెన్స్' అని కూడా ప్రజలనుకుంటున్నారని ఎమ్మెల్సీ వంశీ కల్యాణ్ ఆరోపించారు. ఈ రాష్ట్రంలో ఎన్‌డిఎ పరిస్థితి మరీ ఘోరంగా తయారైందన్నారు. శనివారం ఉదయం సిరిపురంలోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎవరెన్ని కూటములు కట్టినా ప్రజలు మాత్రం 2024లో వన్స్‌మోర్ అంటూ జగనన్న వైపే ఉన్నారని తెలిపారు. బడేళ్ల పరిపాలనలో జగన్మోహన్‌రెడ్డి జనం మేలు కోరారని, అయనకు తమ మద్దతు ప్రకటించాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు 2014 నుంచి 2019 మధ్య ఇచ్చిన ఏ హామీని అమలు చేయకుండా, అందర్నీ నిట్టనిలువునా మోసం చేశారని ఆరోపించారు.



ప్రచారం నిర్వహిస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్

## వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రచారం

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్: పూర్ణామార్కెట్ ఫిష్ మార్కెట్ ప్రాంగణంలో శనివారం కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 65 షాపులకు సంబంధించిన వ్యాపారులు, గుమస్తాలు, హమాలీలను ఈ సందర్భంగా తనకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు.

## మత్స్యకారులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మత్స్యకారులకు అండగా ఉంటామని శ్రీభరత్ రాజ్యసభ సభ్యులు వైవి.సుబ్బారెడ్డి అన్నారు. శనివారం ఉదయం విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ కార్యాలయంలో మత్స్యకార ఆత్మీయ సదస్సు నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మత్స్యకారులను చంద్రబాబు అవమానించారన్నారు. అనంతరం బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేకమని కూటమి నేతలు చెప్పగలరా ? అని ప్రశ్నించారు. ఉక్కు కర్మాగారంపై తన వైఖరి చెప్పిన తర్వాతే చంద్రబాబు విశాఖ గాజువాకలో ఓట్లు అడగాలన్నారు. లాబీయింగ్ చేసే సిఎం రమేష్‌కు అనకాపల్లి ఎంపీ సీటు ఇచ్చారన్నారు తాను వ్యతిరేకమన్నానని అన్నారు. కార్యక్రమంలో బొత్స ఝాన్సీ, తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి.సత్యనారాయణ, దక్షిణ నియోజకవర్గం అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి మారెమ్మ అమ్మవారి ఉత్సవాలు

ప్రజాశక్తి - సీలేరు : జికె వీధి మండలం సీలేరులో మారెమ్మ అమ్మవారి 52వ వార్షిక మహోత్సవాలు ఆదివారం నుండి ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలను తమిళ సంవత్సరాది నుంచి ప్రారంభించడం ఇక్కడ ఆనవాయితీ. సీలేరు జల విద్యుత్ కేంద్రం నిర్మాణ సమయంలో 1960లో తమిళనాడు, కేరళ ప్రాంతాలకు చెందినవారు పనుల నిమిత్తం ఇక్కడ వచ్చారు. ఆలయ ప్రాంగణంలో వారు నివాసమున్నారు. తమిళుల ఆరాధ్య దైవమైన మారెమ్మ అమ్మవారిని ఉన్న చిన్న పాకలో ప్రతిష్ఠించి పూజలు చేసేవారు. ఇక్కడే కొంతమంది వివిధ వ్యాపారాలు చేసుకొని స్థిరపడ్డారు. దీంతో ఈ ఆలయాన్ని క్రమేపి అభివృద్ధి చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గరగ అలంకరణ, అగ్నిగుండ ప్రవేశం ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. సుమారు 60 నుండి 70 మంది భక్తులు ప్రతి ఏటా మాలధారణ చేసి ఉపవాస దీక్షలు చేసి అగ్నిగుండం తొక్కి అమ్మవారి మొక్కులు తీర్చుకుంటారు. ఈనెల 17న గరగ అలంకరణ అనంతరం అగ్నిగుండం కార్యక్రమం నిర్వహిస్తారు. 27న అమ్మవారి ప్రతిమను పురవీధుల్లో ఊరేగిస్తారు. 28న ప్రధాన పండుగ నిర్వహిస్తారు. ఈ రోజు ఆలయ ప్రాంగణంలో భారీ సమారాధన నిర్వహిస్తారు. ఉత్సవాల నేపథ్యంలో ఆలయ కమిటీ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది.

## గుండెపోటుతో ఆర్ఎంపి వైద్యుడు మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండల కేంద్రం రాజవొమ్మంగి గ్రామానికి చెందిన ఆర్ఎంపి వైద్యుడు జాగు రామలింగేశ్వరరావు (70) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. రామలింగేశ్వరరావు గత 50 ఏళ్లుగా ఏజెన్సీలో ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్‌గా సేవలందిస్తున్నారు. ఆర్ఎంపి వైద్యులు ఆయన మృతి పట్ల ప్రభుత్వాలు తెచ్చుకున్నారు. రామలింగేశ్వరరావు మృతి పట్ల రాజవొమ్మంగి ప్రైవేట్ ప్రాక్టీషనర్ వైద్యులు సంతాపం తెలిపారు.

## నేడు బాబు ప్రజాగళం సభలు

ప్రజాశక్తి -అనకాపల్లి ప్రతినిధి : టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆదివారం పాయకరావుపేటలో జరగనున్న ప్రజాగళం సభలో పాల్గొననున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు పాయకరావుపేట జంక్షన్‌లో ఏర్పాటుచేసే సభలో మాట్లాడనున్నారు. అనంతరం సాయంత్రం ఏడు గంటలకు గాజువాక జంక్షన్‌లో జరగనున్న సభలో ప్రసంగిస్తారు.